క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ



శిరీషకు మొక్క అందజేస్తున్న వెంకటఅప్పారావు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. పచ్చని మొక్కను అందజేశారు.నియోజకవర్గంలో శాంతిభద్రతలపై మాట్లాడారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: పాత్రకొండలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బి.అశోక్ ఆదివారం ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ జట్టును అభినందిస్తున్న గురుకులం సిబ్బంది

కంచిలి: కంచిలిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచారు. గత నెల 28, 29, 30 తేదీల్లో అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో గురుకుల పాఠశాల వాలీబాల్ జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. వంద మీటర్ల రన్నింగ్ పోటీల్లో ద్వితీయ ఏడాది బైపీసీ విద్యార్థి ఆర్.యాదగిరి, లాంగ్ జంప్‌లో బి.చరణ్ కాంస్య పతకాలను గెలిపొందారు. విజేతలను ప్రిన్సిపాల్ బి.అప్పారావు, సిబ్బంది ఆదివారం అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పట్టణంలోని కృష్ణానగర్ కాలనీ ఆవరణలో యాంటీడ్రగ్స్, సైబర్‌నేరాలపై ప్రజలకు ఆదివారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

జ్వర లక్షణాలతో మహిళ మృతి!

టెక్కలి రూరల్: పట్టణంలోని రెడ్‌క్రాస్ వీధికి చెందిన రాజాన రాధ (46) జ్వర లక్షణాలతో అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానిక జీడిపిక్కల పరిశ్రమలో కూలిగా పని చేస్తున్న ఆమె కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో టెక్కలి, శ్రీకాకుళం, విశాఖలోని ఆస్పత్రుల్లో కుటుంబ సభ్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి కుమారుడు టెక్కలి మండలం తెలినీలాపురం సచివాలయ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చినంచలలో తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న దుర్యోధనరావు

కాశీబుగ్గ: అకాల వర్షాలతో నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ పలాస అధికార ప్రతినిధి, చినంచల ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు కోరారు. పలాస మండలం చినంచల, గోదారిపేట, రాజగోపాలపురం గ్రామాలలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అనేక విధాలుగా మేలు జరిగిందన్నారు.

తంపర కోసం తగాదా!

- అది మా జీవనం అంటున్న స్వదేశీ మత్స్యకారులు
- కాదు.. తమ వ్యవసాయ భూములంటున్న రైతులు



తగాదాకు కారణమవుతున్న తంపర భూములు

ఇచ్ఛాపురం రూరల్: అటు సముద్రం తీర ప్రాంతానికి, ఇటు వ్యవసాయ పంట భూములకు ఆనుకొని ఉప్పుటేరుతో ఉన్న సుదీర్ఘమైన తంపర భూములు అవి. తరాల నుంచి ఆ భూములను నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామంటూ ఒక వైపు స్వదేశీ మత్స్యకారులు పోరాటం చేస్తుంటే.. ఆ భూములే తమకు అన్నం పెట్టే అన్నపూర్ణ అంటూ మరోవైపు అన్నదాతలు వాటిని వదులుకోవడానికి వెనక్కి తగ్గడం లేదు. దీంతో ఈ అంశం రెవెన్యూ అధికారులకు తలకాయ నొప్పిగా మారింది. ఇది దశాబ్దాల నుంచి వస్తున్న తీరని సమస్య. ఇటీవల ఉచిత గ్యాస్ బండలు పంపిణీ చేసేందుకు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి స్వదేశీ మత్స్యకారులు ఈ సమస్యను వినతి రూపంలో తీసుకురావడంతో 'తంపర భూములు' వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది.

తంపర భూముల్లో వేట..

1936 సంవత్సరానికి ముందు ఇచ్ఛాపురం ప్రాంతం గంజాం జిల్లాలో ఉండేది. స్వదేశీ మత్స్యకారులుగా పిలవబడే కండ్ర కులస్తులు బహుదానది పరివాహక ప్రాంతం, సముద్ర తీర ప్రాంతాల్లో ఉండే తంపర భూముల్లో పారే ఉప్పుటేరులో చేపల్ని పట్టుకొని జీవనం సాగించడం వీరి కుల వృత్తి. ఆంధ్రా, ఒడిశాలు వేర్వేరు కావడంతో ఇచ్ఛాపురం ప్రాంతం శ్రీకాకుళం జిల్లాకు పరిమితం కావడంతో ఒడియా మాతృభాష గల కండ్ర కులస్తులు ఆంధ్రాలోనే ఉండిపోయారు. ఇచ్ఛాపురం, ఈదుపురం, కవిటి గ్రామాల్లో వందల సంఖ్యలో ఈ కుటుంబాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈదుపురం గ్రామంలో సుమారు 900 కండ్ర కులానికి చెందిన కుటుంబాలు కేశుపురం, బూర్జపాడు, నెలవంక పంచాయతీ పరిధిలో ఉండే సుమారు 1400 ఎకరాల తంపర భూముల్లో మావులు వేసుకుంటూ చిన్న చేప పిల్లలు, రొయ్యల్ని వేట సాగిస్తూ వస్తున్నారు. తంపర భూముల్లో వేట సాగిస్తున్నందుకు ఏటా ప్రభుత్వానికి శిస్తును సైతం చెల్లిస్తున్నారు. వీరిని 'స్వదేశీ మత్స్యకారులు' (ఇన్‌లాండ్ ఫిషరీస్) గా ప్రభుత్వం గుర్తించి సాధారణ మత్స్యకారులుగానే ప్రభుత్వం వీరికి 50 ఏళ్లకే సామాజిక భద్రతా పింఛన్లు అందజేస్తుంది.

తంపర భూముల్లో రైతులు వ్యవసాయం

బూర్జపాడు, డొంకూరు, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు 260 సర్వే నంబర్‌తో తంపర భూముల్లో డీ-పట్టాలతో వ్యవసాయం చేస్తూ వస్తున్నారు. బహుదానదికి భారీ వరదలు వచ్చిన సమయంలో నిత్యం ముంపునకు వ్యవసాయ భూములు గురౌతుండటంతో వీరంతా తంపర భూముల్లో వ్యసాయానికి అనువైన ప్రాంతాలను ఎన్నుకొని వ్యవసాయం చేస్తూ వస్తున్నారు.

అసలు సమస్య ఇదే

తంపర భూముల్ని నమ్ముకుంటూ.. ప్రభుత్వానికి వేలాది రూపాయలు శిస్తు రూపంలో చెల్లిస్తుంటే రైతులు తమ తంపర భూముల్ని ఆక్రమించుకుంటూ వ్యవసాయ భూములుగా మార్చేస్తున్నారని స్వదేశీ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తంపర భూముల్లో పశువులను సైతం మేతకు వదిలివేస్తూ చేపల కోసం వేసిన మావుల్ని పడగొడుతూ తమ జీవనంపై దెబ్బ కొడుతున్నారంటున్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామాలను ఆనుకొని ఉండే తంపరలో తమ వ్యవసాయ భూములు ఉన్నాయని, వరదలు వచ్చే సమయాల్లో పంటను కోల్పోతుండటంతో తప్పని పరిస్థితుల్లో అనువుగా ఉండే ప్రాంతాల్లో పంటను పండించుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్నామని రైతులు చెబుతున్నారు.

అధికారులకు తలనొప్పి

తంపర భూముల వ్యవహారంపై స్వదేశీ మత్స్యకారులు 2016లో హైకోర్టులో పిటీషన్ వేయగా ప్రస్తుతం కేసు పెండింగ్‌లో ఉంది. ఇరువర్గల ఫిర్యాదు మేరకు 2017 మే ఏడో తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ లక్ష్మీనృసింహం, టెక్కలి ఆర్డీఓ వెంకటరావులు వేర్వేరుగా వచ్చి రైతులు, స్వదేశీ మత్స్యకారులతో చర్చించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఇటీవల ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడ్ని కలసి స్వదేశీ మత్స్యకారులు వినతిపత్రం అందించడంతో మరోమారు ఈ అంశం తెరపైకి రావడంతో జిల్లా మత్స్యశాఖ డీడీ నాగేశ్వరరావు, ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎన్.వెంకటరావులు తంపర భూములను మరోమారు పరిశీలించారు.

అవి మా వ్యవసాయ భూములు



మా గ్రామాలకు అనుసంధానంగా ఉండే తంపర భూములు అవి. తమకు అనుకూలంగా ఉండే భూముల్లో పంటను పండించుకుంటున్నాం. స్వదేశీ మత్స్యకారుల వేటకు ఎప్పుడూ భంగం కలింగచలేదు. భూములపై ఆధారపడుతూ సుమారు 300 మంది రైతులు కుటుంబాలు బతుకుతున్నాయి. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలి

– దున్న జానకీరావు, రైతు, డొంకూరు

న్యాయ పోరాటం చేస్తున్నాం



మా తాతలు, ముత్తాతల నుంచి తంపర భూముల్లో చేపల వేట సాగిస్తూ కుటుంబాలకు పోషించుకుంటున్నాం. మా ప్రధాన వృత్తి ఇదే కావడంతో న్యాయ పోరాటం చేస్తున్నాం. అడ్డగోలుగా తంపర భూముల్లో వ్యవసాయం చేయడం, సొంతం చేసుకుంటున్నారు స్థానికులు. మా మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రభుత్వం సర్వే చేసి తంపర భూములు మాకు అప్పగించాలి.

– గస్యా దేవరాజు బెహరా, అధ్యక్షుడు, ఇన్‌లాండ్ ఫిషరీస్ సొసైటీ. ఈదుపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



సీఎం పేషీ నుంచి వచ్చిన లేఖ ఆధారంగా తంపర భూముల్లో పర్యటించడం జరిగింది. అక్కడ పూర్వపరాలు పరిశీలించిన పిదప స్వదేశీ మత్స్యకారులు, స్థానిక రైతులతో మాట్లాడాం. పూర్తి వివరాలతో ఉన్నతధికారులకు నివేదిక అందిస్తాం.

– నిడుగుడ్ల వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం

నయవంచకుడు చంద్రబాబు

- ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

ఇచ్ఛాపురం: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిన ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. పెరుగుతున్న చార్జీలతోనే ప్రజల నుండే సంపద సృష్టించగల మోసగాడు చంద్రబాబు అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మరోసారి నయవంచనకు గుచిచేశారని ఎమ్మెల్సీ అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని..తాము అధికారంలోని వస్తే సంపద సృష్టిస్తామంటూ సంక్షేమం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసరాలతో పాటు విద్యుత్ చార్జీలు పెంచేసి ఆ సంపదను ప్రజల నుంచి సృష్టించే పనిలో చంద్రబాబు పడ్డారన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీల దృష్ట్యా రానున్న జనవరి నుంచి ప్రజలు యూనిట్‌కి 2.19 రూపాయలు అదనంగా చెల్లించవలసి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో నిత్యావసర సరుకులతో పాటు ఉచితంగా ఇస్తామన్న ఇసుక, రిజిస్ట్రేషన్ల చార్జిలు, స్కూల్, కళాశాల ఫీజులు భారీగా పెరిగాయన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన సూపర్‌సిక్స్ ష్యూరిటీ ఏమోగాని ప్రస్తుతం పరిస్థితిని చూస్తే చార్జీల బాదుడు గ్యారంటీగా తయారైందన్నారు. అన్నింటా చార్జీలు పెంచేసి జనంపై భారం వేస్తే వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, ఎంపీపీ బోర పుష్ప, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, వైస్ ఎంపీపీ వివేకానంద, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, పి.శేఖర్, నాయకులు పిలక సంతు, కారింగి మోహనరావు, కాళ్ల సత్యం, వార్డు కౌన్సిలర్లు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కొనసాగించాలి

టెక్కలి: నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కొనసాగించాలని నందిగాం గ్రామానికి చెందిన ఎ.సురేష్‌తో పాటు మరికొంత మంది కోరారు.ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పలాస డివిజన్‌లో ఉండడం వలన నందిగాం మండలంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ ప్రభుత్వ కార్యాలయాల అవసరాల నిమిత్తం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నందిగాం మండలం టెక్కలికి అనుకూలంగా ఉంటుందని దీనిపై పాలకులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

సోంపేట: వైద్య సేవలపై సోంపేట ఏరియా పరిధిలోని గ్రామీణ వైద్యులకు విశాఖకు చెందిన వైద్యులు శేషయాదవ్, శ్రీకాంత్ ఆదివారం సోంపేటలో అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షణ్ముఖరావు, శ్రీనివాసరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

నేడు వరి పొలాల సందర్శన

సోంపేట: ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలతో నష్టపోయిన వరి పొలాలను సోమవారం సందర్శించాలని వ్యవసాయ సిబ్బందికి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు సూచించారు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆదివారం రెండు సెంటీమీటర్ల వర్షం కురిసిందన్నారు.

అన్నదాతకు అకాల కష్టం

అన్నదాతకు అకాల కష్టం వచ్చింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి రైతుకు కంటిపై కునుకులేకుండా పోయింది. చేతికి అందివచ్చిన పంట నేలకొరగడంతో ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికే కోసిన వరి పనలను కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారింది. నూర్పులు చేసిన ధాన్యం తడవకుండా టార్పలిన్లు కప్పుతున్నారు. సోంపేట మండలంలో రెండు సెంటీమీటర్ల వర్షం నమోదైనట్టు అధికారులు ఆదివారం తెలిపారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులను అప్రమత్తం చేయడంతోపాటు పలు సూచనలు చేస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు తమ వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకుంటున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



కవిటి: బొరివంకలో నేలకొరిగిన వరిపైరు



సోంపేటలో నేలకొరిగిన వరి పంట



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి వద్ద నేలకొరిగిన వరి చేను



వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేటలో మత్స్యకారులకు సూచనలు చేస్తున్న మత్స్యశాఖ ఫీల్డుమెన్ కొండ నాగరాజు



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో వరి కుప్పలపై పరదాలు వేస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు: బట్టుపాడులో తడిసిన వరి పనలు

బహుమతి ప్రదానం



ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ఆర్‌సీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో డిబేట్, రంగోళి, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు జరిగాయి. మెడికల్ సిబ్బంది ఎ.శివరామకృష్ణ,, ఎన్‌జీవో ఎల్.నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, సిబ్బంది వి.ల్యూక్‌పాల్, సిహెచ్.రాంబాబు, వాసుబాబు, గొల్ల పాల్గొన్నారు.

–టెక్కలి

ప్రతిభా పరీక్షలతో పోటీతత్వం



ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయని కంచిలి ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. సోంపేట, కంచిలి మండలాల పీఆర్‌టీయూ శాఖల ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షను సోంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించగా 468 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ , ద్వితీయ, తృతీయ స్థానాల్లో జుత్తు తిరుమల (ఎర్రముక్కాం), ఉమా మాధురి (డి.జి.పురం), చందు (బొరివంక) నిలిచారు. మొదటి పదిస్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. పీఆర్‌టీయూ ప్రతినిధులు దాలిబందు, శరత్ బాబు, రమేష్‌పాణిగ్రాహి, వేణుగోపాల్, మాధవరావు పాల్గొన్నారు.

తుంగలోకి విద్యుత్ చార్జీల వాగ్దానం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు వాగ్దానం చేశారని.. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాగ్దానం తుంగలో తొక్కేసి చార్జీలు పెంచేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుపై ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు చార్జీలు పెంచారని గుర్తు చేశారు. బాబూ ష్యూరిటీ పక్కన పెడితే వీర బాదుడు గ్యారంటీగా పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయక పోగా, నిత్యావసర సరకుల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో మరోసారి విద్యుత్ చార్జీల రూపంలో ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తిలక్ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల సభల్లో చంద్రబాబు ఊదరగొట్టే ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. చార్జీలను తగ్గించకపోగా ప్రజలపై భారం పడే విధంగా పెంచుకుపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక, మద్యం రూపంలో నాయకులు ఆదాయాన్ని సమకూర్చుకున్నారే తప్పా ప్రజలకు అవసరమైన పాలనపై కనీసం దృష్టి సారించలేదని తిలక్ మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీతో మరోసారి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారని గుర్తు చేశారు. కేవలం ఆరు నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం మోసం బయటపడిందన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు అన్నెపు రామారావు, కెల్లి గోవిందరావు ఉన్నారు.

పారదర్శకతకు తిలోదకాలు

- మండల సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పారదర్శకతకు పాత రేసి పక్షపాతవైఖరిని ప్రోత్సహిస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తా రు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు విషయాలను ప్రస్తావించారు. ఇటీవల చేపట్టిన మినీగోకులం యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రాతిపదికన నిర్వహించారని పశుసంవర్ధక, ఉపాధిహామీ పథకం శాఖల అధికారులను నిలదీశారు. ఈ అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్ల నమిలారు. మండలంలో కేటాయించిన గోకులం యూనిట్లన్నీ అర్హులైన రైతులకు కాకుండా టీడీపీ నేతలకు, వారి అనుయాయులకు కట్టబెట్టారని ఆరోపించారు. పత్రికాప్రకటన వెలువరించకుండా ఎందుకు మీరు ఈ విధంగా నిర్వహించారు అనే ప్రశ్నకు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ జవాబుదాటవేశారు. ఈ తరహాలో అధికారులు ఉదాసీన వైఖరి, కూటమి ప్రభుత్వం వైఫల్యాలకు పరాకాష్టగా నిలిచిందని సభ్యులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల ఉపాధిహామీ పథకంలో మండలంలో 180కి పైగా పనులు మంజూరైతే వీటిని చేపట్టేందుకు కేవలం 45 మంది మెండార్లను నియమించారని.. వీరి నియామకం కూడా అధికార పార్టీ సానుభూతి పరులకే కట్టబెట్టారని సభ్యులు మండిపడ్డారు. మండలంలో జరుగుతున్న రోడ్ల పనులో నాణ్యతపై ప్రశిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను కాదని.. బరితెగింపు చర్యలకు పాల్పడుతున్న కూటమి నేతలకు అధికారులు కొమ్ముకాయడం దురదృష్టకరమన్నారు. ప్రధానంగా గడచిన సమావేశాల మాదిరిగానే తాజా సమావేశానికి సైతం సగానికి పైగా శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. జంగిల్ క్లియరెన్స్ కోసం గడచిన కొన్నినెలలుగా ఈ సమావేశాల్లో ఆర్ అండ్‌బీశాఖ అధికారులకు అడుగుతున్నా స్పందన లేకపోవడంపై సభ్యులు విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. అధికారులు పక్షపాత వైఖరి విడనాడి పారదర్శకంగా ఉండాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ ధనంజయమఝ్జి, హెచ్ఓ పోలాకి మాధవీలత, పీఆర్ జేఈ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ముత్యాలమ్మ కోనేరు పరిశీలన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ముత్యాలమ్మ కోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏపీ ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, అధికారులు ఆదివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేయాలని సూచించారు.

అనాథలకు అల్పాహారం అందజేత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి అనాథలు, యాచికులకు సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు ఆదివారం అల్పాహారం అందించారు. ప్రతీ నెల ఒకటో తేదీన పలాస మండలం రామక్రిష్టాపురం సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన విద్యార్థులు తమ పోకెట్ మణితో అల్పాహారం కొనుగోలు చేసి ఎలాంటి ఆదరణలేని వారందరికి అందజేస్తుంటారు.

ఐక్యతగా సమస్యలు పరిష్కరించుకుందాం

టెక్కలి: ఐక్యతగా సమస్యలు పరిష్కరించుకుందామని డ్రగ్ ట్రేడ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శిష్టు జగం అన్నారు. ఆదివారం టెక్కలి మండలం తెలినీలాపురం గ్రామంలో అసోషియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎనుకున్నారు. కార్యదర్శిగా బి.తవిటయ్య, కోశాధికారిగా బి.బాలకృష్ణ, సభ్యులుగా ఎ.వెంకటేశ్వర్రావు, పి.సంతోష్‌ను ఎనుకున్నారు. సమావేశంలో టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కాశీబుగ్గ: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఐసీటీసీ మెడికల్ కౌన్సిలర్ బగాతి శ్రీకాంత్, ఆస్పత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. అందరం కలిసి ఎయిడ్స్‌ను నివారిద్దామంటూ పలాస జీడిపిక్కల జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు.